సాక్షి
కుమురం భీం

సోమవారం ; 20 ; ఫిబ్రవరి ; 2023



ఆదివాసీల పోరుబాట
ఆదివాసీ సంఘాలు పోరుబాట పట్టాయి. 11 కులాలను ఎస్టీ జాబితాలో కలపాలనే ప్రభుత్వ వైఖరికి నిరసనగా సోమవారం ఐటీడీఏ ముట్టడికి పిలుపునిచ్చాయి. 8లో▸



శివయ్యా..చల్లంగా చూడు
ఈజ్‌గాం శివమల్లన్న ఆలయంలో ఆదివారం మూడో రోజు జాతర కొనసాగింది. భక్తులు ఆలయ ఆవరణలో బోనాలు పోసి మల్లన్నకు నైవేద్యాన్ని సమర్పించారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
36.4 /17.3

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం వేడి, ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. రాత్రి చలి ప్రభావం తగ్గుతుంది.

న్యూస్‌రీల్

'సేవాలాల్ జయంతి ఘనంగా నిర్వహిద్దాం'



మాట్లాడుతున్న రాథోడ్ రూప్‌లాల్

కెరమెరి(ఆసిఫాబాద్): జిల్లా వ్యాప్తంగా సేవాలాల్ జయంతి ఘనంగా నిర్వహిద్దామని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రూప్‌లాల్ పిలుపునిచ్చారు. కెరమెరి మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 21న జిల్లా కేంద్రంలో ఉదయం 11.30 గంటలకు సేవాలాల్ జయంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని తండాల నుంచి ప్రజాప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. రామారావు మహరాజ్ అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బదావత్ శివాజీ, సుభాశ్, గంగారాం, సున్నబాయి, రేణుకాబాయి, సంక్‌లాల్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ ప్రయోగ పరీక్షలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నట్లు డీఐఈవో శ్రీధర్ సుమన్ తెలిపారు. ఆదివారం పలు కేంద్రాల్లో కొనసాగుతున్న ప్రాక్టికల్స్‌ను ఆయన పరిశీలించారు. ఉదయం నిర్వహించిన ప్రయోగ పరీక్షలకు 693 మంది విద్యార్థులకు గాను 663 మంది హాజరు కాగా 30 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 442 మందికి విద్యార్థులకు గాను 424 మంది హాజరు కాగా 18 మంది గైర్హాజరయ్యారని డీఐఈవో వెల్లడించారు. ఇంటర్ బోర్డు నిబంధనల మేరకు పరీక్షలు కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

గీత కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి



మాట్లాడుతున్న అంజనేయులుగౌడ్

రెబ్బెన(ఆసిఫాబాద్): కల్లు గీత కార్మికుల న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని మోకుదెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసరి ఆంజనేయులుగౌడ్ అన్నారు. మండలంలోని నంబాల, నారాయణపూర్, కొమురవెల్లి, గంగాపూర్ గ్రామాల్లో ఆదివారం మోకుదెబ్బ నాయకులు పర్యటించారు. గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్లు గీత కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఏజెన్సీ గ్రామాల్లో లైసెన్సులను పునరుద్ధరించాలని, తాటి, ఈత చెట్లు ఎక్కేందుకు అధునాతన పనిముట్లు అందించాలన్నారు. కార్మికులకు అందజేస్తున్న ఎక్స్‌గ్రేషియాను రూ.10లక్షలకు పెంచాలని, బ్రాందీ షాపుల్లో గౌడ కులస్తులకు 50శాతం వాటా ఇవ్వాలని, డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం 21న మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో మోకుదెబ్బ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల అధ్యక్షుడు రామాగౌడ్, సీనియర్ నాయకులు లక్ష్మీనారాయణగౌడ్, తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, రెబ్బెన గ్రామ సొసైటీ అధ్యక్షుడు కిష్టాగౌడ్, నాయకులు మల్లాగౌడ్, రవిగౌడ్, తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

అండర్ ఆర్మ్ క్రికెట్ పోటీలకు ఎంపిక



విద్యార్థులతో ప్రిన్సిపాల్ ఖలీల్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు విక్రమ్, అజయ్ అండర్ ఆర్మ్ క్రికెట్ పోటీల్లో జాతీయ జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం విద్యార్థులను పీడీ తిరుపతితో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డిసెంబర్ 22 నుంచి పంజాబ్‌లో నిర్వహించిన అండర్ 14 జాతీయ స్థాయి పోటీల్లో విక్రమ్, అజయ్ సత్తా చాటి అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. వీరు ఈనెల 22 నుంచి 24 వరకు నేపాల్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

అగ్గి పడితే.. బుగ్గే!



తిర్యాణి మండలం పంగిడిమాదార గ్రామంలో కాలిబూడిదైన ఇళ్లు (ఫైల్)

- జిల్లా వ్యాప్తంగా రెండే ఫైర్ స్టేషన్లు
- మారుమూల గ్రామాలకు సకాలంలో చేరుకోలేని పరిస్థితి
- ప్రమాద స్థలానికి చేరుకునేలోపే ఆస్తులు మంటలకు ఆహుతి
- అగ్ని ప్రమాదాల్లో సర్వం కోల్పోయి రోడ్డున పడుతున్న కుటుంబాలు

వాంకిడి(ఆసిఫాబాద్): ఏటా వేసవిలో జరిగే అగ్ని ప్రమాదాలతో బాధిత కుటుంబాలు సర్వం కోల్పోయి రోడ్డున పడుతున్నాయి. కూడబెట్టుకున్న ఆస్తులు కాలి బూడిదవుతుండటంతో బాధితులు కట్టుబట్టలతో మిగులుతున్నారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఆస్తులను రక్షించాల్సిన అగ్నిమాపక కేంద్రాలు మారుమూల పల్లెలకు ఆమడదూరంలో ఉండటంతో తీవ్ర నష్టం జరుగుతోంది.

వేసవి ప్రారంభంలోనే రెండు భారీ ప్రమాదాలు
జిల్లాలో వేసవి ప్రారంభంలోనే రెండు భారీ అగ్ని ప్రమాదాలు సంభవించాయి. ఈ నెల 6న అర్ధరాత్రి తిర్యాణి మండలం పంగిడిమాదార గ్రామ పంచాయతీ పరిధిలో గల సల్పలగూడ గ్రామంలో ఐదిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. నాలుగు కుటుంబాలు రోడ్డున పడ్డాయి. పత్తి పంటలు అమ్మిన డబ్బులతో పాటు దాచుకున్న సొమ్ము, వెండి, బంగారు ఆభరణాలు పూర్తిగా అగ్నికి ఆహుతి అయిపోయాయి. సుమారు రూ.30 లక్షలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లింది. అంతకు ముందు రోజే కాగజ్‌నగర్ మండలంలోని రాస్పెల్లి గ్రామంలో పెర్క సంతోష్ అనే వ్యక్తి ఇంట్లో నిల్వ ఉంచిన 100 క్వింటాళ్ల పత్తి, 20 క్వింటాళ్ల ధాన్యం ప్రమాదవశాత్తు కాలి బూడిదైంది. ఫైరింజన్‌కు సమాచారం అందించినా అప్పటికే నష్టం జరిగిపోయింది. సుమారు రూ.10 లక్షల వరకు నష్టం జరిగింది. సిర్పూర్(యు) మండలంలోని ఎత్నూర్ గ్రామంలోనూ ఓ రైతు ఇంట్లో పత్తి పంటను నిల్వ ఉంచడంతో అగ్ని ప్రమాదం జరిగింది. 15 క్వింటాళ్ల పత్తి కాలిపోయింది. సదరు రైతు రూ.1.5 లక్షల వరకు నష్టపోవాల్సి వచ్చింది. గతేడాది 2022లో జిల్లాలో మొత్తం 39 అగ్ని ప్రమాదాలు జరగగా, రూ.41 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది.

ఇదీ పరిస్థితి..
జిల్లాలోని 15 మండలాల పరిధిలో 419 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. జిల్లా విస్తీర్ణం 4,878 చ.కి.మీలుగా ఉంది. కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో సిర్పూర్(టి), దహెగాం, కౌటాల, బెజ్జూర్, పెంచికల్‌పేట్, చింతలమానెపల్లి, కాగజ్‌నగర్ మొత్తం ఏడు మండలాలు ఉండగా, ఆసిఫాబాద్ డివిజన్‌లో సిర్పూర్(యూ), లింగాపూర్, జైనూర్, తిర్యాణి, ఆసిఫాబాద్, కెరమెరి, వాంకిడి, రెబ్బెనతో కలిసి 8 మండలాలు ఉన్నాయి. ప్రస్తుతం జిల్లాలో డివిజన్ కేంద్రాలైన ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాల్లో మాత్రమే అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి. డివిజన్ కేంద్రాల నుంచి కొన్ని గ్రామాలు సుమారు 50 కి.మీ.ల దూరంలో ఉన్నాయి. అనేక గ్రామాలకు సరైన రహదారులు కూడా లేవు. దీంతో ఏదైన అనుకోని ప్రమాదం జరిగితే ఫైరింజన్లు కూడా సరైన సమయానికి చేరుకోలేని పరిస్థితి. కిలోమీటర్ల మేర ప్రయాణం, గుంతల రహదారులపై ఫైరింజన్ ఘటన స్థలానికి చేరుకునేలోపే ఆస్తులన్నీ కాలి బూడిదవుతున్నాయి. తిర్యాణి మండలం ఆసిఫాబాద్ నుంచి సుమారు 50 కి.మీ.ల దూరం ఉంటుంది. ఆ మండలంలోని గ్రామాలు మరింత దూరంలో ఉంటాయి. అలాగే కౌటాల, బెజ్జూర్, పెంచికల్‌పేట్, జైనూర్, లింగాపూర్, కెరమెరి, లింగాపూర్, సిర్పూర్(యూ) మండలాల్లోని గ్రామాలు డివిజన్ కేంద్రాలకు 50 కి.మీ.ల కంటే ఎక్కువ దూరంలో ఉంటాయి. ఆసిఫాబాద్ డివిజన్‌లోని జైనూర్, కెరమెరి ప్రాంతంలో, కాగజ్‌నగర్ డివిజన్‌లోని కౌటాల, బెజ్జూర్ ప్రాంతాల్లో కొత్తగా ఫైర్ స్టేషన్‌లు ఏర్పాటు చేయాలని ప్రజల నుంచి డిమాండ్ ఉంది.

పత్తి నిల్వతో ప్రమాదాలు అధికం
గ్రామాల్లో రైతులు పత్తి పంటను ఇళ్లల్లో నిల్వ ఉంచడంతో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంది. పత్తి, ధాన్యం, కందులు వంటి పంటలను ఇంట్లో కాకుండా వేరే చోట నిల్వ చేసుకోవాలి. పత్తిలో కెమికల్ రియాక్షన్ జరిగి అగ్గి రాజుకునే అవకాశం ఉంటుంది. అదేవిధంగా విద్యుత్ తీగలను సరిచూసుకోవడం, గ్యాస్ లీకేజీలు గమనించడం, పొయ్యి మంటలను ఎప్పటికప్పుడే ఆర్పివేయడం వంటి జాగ్రత్తలు పాటించాలి. ప్రమాదం జరిగిన మరుక్షణమే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందిస్తే ఆస్తి నష్టాన్ని నివారించే అవకాశం ఉంటుంది. వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.
– అజయ్, డివిజన్ ఫైర్ ఆఫీసర్

వంద శాతం వసూలయ్యేనా..?



కాగజ్‌నగర్ మండలంలోని రాస్పెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

- జిల్లాలో పన్ను వసూళ్ల లక్ష్యం రూ.6.13 కోట్లు
- ఇప్పటివరకు రూ.4.13 కోట్లు మాత్రమే వసూలు
- ముంచుకొస్తున్న గడువు
- జిల్లాలో 335 గ్రామ పంచాయతీలు

తిర్యాణి(ఆసిఫాబాద్): ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు గడువు సమీపిస్తున్నా పన్నుల వసూళ్లల్లో వేగం పుంజుకోవడం లేదు. జిల్లాలో ఇప్పటివరకు నిర్దేశించుకున్న లక్ష్యంలో కేవలం 67.3 శాతం మాత్రమే పన్నులు వసూలయ్యాయి. మేజర్ గ్రామ పంచాయతీలతోపాటు ముఖ్యంగా చిన్న పంచాయతీలకు పన్నులే ప్రధాన ఆర్థిక వనరు. గడువు ముంచుకొస్తుండటంతో గ్రామ పంచాయతీ సిబ్బంది ఉరుకులు పరుగులు పెడుతున్నారు.

లక్ష్యం చేరేనా..
గతంలో మూడు, నాలుగు గ్రామ పంచాయతీలకు ఒకే కార్యదర్శి విధులు నిర్వర్తించేవారు. దీంతో పన్నుల వసూళ్లలో తీవ్ర జాప్యం జరిగేది. ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నియామకం చేపట్టడంతో పంచాయతీల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. ఏటా చాలా జీపీల్లో వందశాతం పన్నులు వసూలవుతున్నాయి. జిల్లాలోని 15 మండలాల పరిధిలో 335 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2022– 23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్నులు, పన్నేతర చార్జీల రూపంలో రూ.6.13 కోట్లు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటివరకు రూ.4.13 కోట్లు వసూలు కాగా, మరో రూ.2 కోట్లు వసూలు కావాల్సి ఉంది. కాగజ్‌నగర్(71 శాతం వసూలు)తో పోల్చితే ఆసిఫాబాద్(65.8) డివిజన్ పన్నుల వసూలులో కాస్త వెనుకబడింది.

చిన్న పంచాయతీలకు కీలకం..
చిన్న పంచాయతీలకు స్థానికంగా వసూలు చేసే పన్నులే ప్రధాన ఆదాయ వనరుగా ఉంటున్నాయి. పారిశుధ్యం, తాగునీరు, వీధిదీపాల నిర్వహణ, సిబ్బంది జీతభత్యాలు తదితర పనులకు పన్నుల రూపంలో వచ్చే నిధులనే వినియోగిస్తారు. కాగజ్‌నగర్ మండలంలోని వల్లకొండ, రేగులగూడ, మాలిని, బోడపెల్లి పంచాయతీలు ఇప్పటికే వందశాతం పన్నులు వసూలు చేసి ఆదర్శంగా నిలుస్తున్నాయి. పంచాయతీ కార్యదర్శులు ప్రణాళికతో పనిచేస్తే గడువుకు ముందే లక్ష్యాన్ని చేరుకునేందుకు అవకాశం ఉంది.

వందశాతం వసూలు చేస్తాం
జిల్లాలో వందశాతం పన్నులు వసూలయ్యేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. గడువులో లక్ష్యం చేరుకునేందుకు ఇప్పటికే పంచాయతీ సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. ఎప్పటికప్పుడు వివరాలు సేకరిస్తూ, పర్యవేక్షిస్తున్నాం. ప్రజలు పన్నులు చెల్లించి, గ్రామాల అభివృద్ధికి సహకరించాలి.
– రమేశ్, జిల్లా పంచాయతీ అధికారి

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే కోనేరు కోనప్ప



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

కాగజ్‌నగర్‌రూరల్: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. కాగజ్‌నగర్‌కు చెందిన అహ్మద్ ఆరీఫొద్దీన్, సిర్పూర్(టి)కి చెందిన మహ్మద్ రఫీక్‌లను ప్రభుత్వం ఖాజీలు(మత గురువులు) నియమించింది. ఈ నేపథ్యంలో ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలో మైనార్టీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వీరిని సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యాభివృద్ధికి మైనార్టీ గురుకులాలు, పేదింటి బిడ్డల పెళ్లిల కోసం షాదీ ముబారక్ లాంటి అనేక సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. సీఎం కేసీఆర్‌కు ప్రతిఒక్కరూ అండగా నిలవాలని కోరారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్ మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమం కోసం కోనప్ప కృషి చేస్తున్నారని అన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తున్నారని పేర్కొన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యేను ముస్లిం మత పెద్దలు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు, మత పెద్దలు పాల్గొన్నారు.

సనాతన ధర్మ పరిరక్షకుడు శివాజీ

- జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు
- ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి



శివాజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: హిందూ సనాతన ధర్మ పరిరక్షణకు పాటుపడిన వీరుడు ఛత్రపతి శివాజీ అని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఆత్రం సక్కు అన్నారు. జిల్లా కేంద్రంలోని చెక్‌పోస్టు వద్ద ఆదివారం ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆరె సంక్షేమ సంఘం భవనం వద్ద గల శివాజీ విగ్రహానికి జెడ్పీ చైర్‌పర్సన్‌తోపాటు ఆరె సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జయరాం, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు పూలమాలలు వేశారు. ఆరె సంక్షేమ సంఘం భవనం నుంచి అంబేద్కర్‌చౌక్, వివేకానంద చౌక్ మీదుగా నిర్వహించిన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సంఘం నాయకులతో కలిసి అదనపు కలెక్టర్ రాజేశం జెండా ఆవిష్కరించారు. జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ నేటి యువత శివాజీ అడుగు జాడల్లో నడవాలన్నారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ఆరె కులస్తులకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చొరవ తీసుకుని ఏబీసీ సర్టిఫికెట్ అందజేయాలని డిమాండ్ చేశారు. శివాజీ జయంతిని అధికారికంగా నిర్వహించాలని, సంక్షేమ భవనాలకు నిర్మాణ స్థలం కేటాయించాలన్నారు. యూనియన్ బ్యాంకు ఎదుట చౌక్‌కు శివాజీ చౌక్‌గా నామకరణం చేసి, విగ్రహ ఏర్పాటుకు మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లన్న శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఆరె సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బిక్కాజీ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షుడు తిరుపతి, బీజేపీ నాయకులు ఖాండ్రె విశాల్, పాల్వాయి హరీశ్‌బాబు, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్, నాయకులు కేశవ్‌రావు, అన్నారావు, గోపాల్, ప్రశాంత్, సంతోష్, బాలేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

పుణ్యస్నానాలకు పోటెత్తిన భక్తజనం

- వార్ధా, ప్రాణహిత నదుల వద్ద బారులు



తాటిపల్లికి ఎడ్లబండ్లపై వెళ్తున్న భక్తులు

కౌటాల(సిర్పూర్): మహాశివరాత్రి ఉత్సవాల్లో భక్తులు నదిలో పుణ్యస్నానాలకు పోటెత్తారు. జిల్లా పరిధిలోని వార్ధా, ప్రాణహిత నదుల వద్దకు ఇరు రాష్ట్రాల నుంచి ప్రజలు తరలివచ్చారు. కౌటాల మండలం తాటిపల్లిలోని శ్రీసిద్ధి హనుమాన్ మందిరంలో నాలుగోరోజు ఆదివారం ప్రత్యేక పూజలు కొనసాగాయి. సమీప గ్రామాల ప్రజలు ఎడ్లబండ్లపై జాతరకు రాగా, మహారాష్ట్ర నుంచి భక్తులు నాటు పడవలపై జాతరకు చేరుకున్నారు. వార్ధా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో ఆలయంలో భక్తులతో కిటకిటలాడింది.

మహాయజ్ఞం
కౌటాల మండలం వీర్దండి సమీపంలోని వార్ధా నది వద్ద ఉన్న జైబీర్య హనుమాన్ మందిర్ ప్రశాంత్‌ధామ్‌లో మహాశివరాత్రి జాతర సందర్భంగా యోగా గురు అశోక్ ఆర్య ఆధ్వర్యంలో మహా యజ్ఞం నిర్వహించారు. తుమ్మిడిహెట్టి సమీపంలోని ప్రాణహిత నది పుష్కర్ ఘాట్ ఒడ్డున గల శ్రీశివసంత కార్తీక్ స్వామి మహరాజ్ మందిర్ ప్రశాంత నిలయంలో గోపాల కళ, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు సమీపంలో ప్రాణహిత నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ అర్చకులు మారోతి మహరాజ్, ఆలయ కమిటీ అధ్యక్షులు ఎల్ములే దత్తు, పర్చాకే బందు, సభ్యులు నితేష్, మోరేశ్వర్, గణపతి, రవి, భారత్ తదితరులు పాల్గొన్నారు.

'పది'లమైన ప్రిపరేషన్

- మెరుగైన ఫలితాల కోసం ప్రత్యేక తరగతులు
- ఏప్రిల్ 1 వరకు అల్పాహారం
- వందశాతం ఉత్తీర్ణతపై దృష్టి సారించిన విద్యాశాఖ
- జిల్లాలో 2,846 మంది పదో తరగతి విద్యార్థులు



కౌటాలలో కొనసాగుతున్న ప్రత్యేక తరగతులు (ఫైల్)

అల్పాహారం మెనూ

సోమవారం:	బిస్కెట్ ప్యాకెట్
మంగళవారం:	అరటిపండు, పల్లీపట్టి ప్యాకెట్
బుధవారం:	అరటిపండు, రెండు ఉడికిన గుడ్లు
గురువారం:	అరటిపండు, ఉడికిన శనిగలు
శుక్రవారం:	అరటిపండు, అటుకుల చుడువ
శనివారం:	అరటిపండు, నువ్వులు లేదా పల్లీ పట్టి

అల్పాహారం పంపిణీ
జిల్లాలో 58 ప్రభుత్వ, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో 2,846 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. వీరికి బుధవారం నుంచి ఏప్రిల్ 1 వరకు 34 రోజులపాటు అల్పాహారం అందించనున్నారు. జిల్లాకు రూ.14,51,460 నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులను జిల్లా విద్యాశాఖ అధికారి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఖాతాల్లో జమ చేశారు. ప్రతీ విద్యార్థికి రూ.15 విలువ చేసే పోషక విలువలు కలిగిన అల్పాహారం అందించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. అల్పాహారం పంపిణీతో ప్రత్యేక తరగతులకు విద్యార్థుల గైర్హాజరు తగ్గుతుందని ఉపాధ్యాయులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



అల్పాహారం అందిస్తున్న ఉపాధ్యాయులు

కౌటాల(సిర్పూర్): విద్యార్థుల జీవితాలను మలుపు తిప్పే పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్నాయి. ఈ క్రమంలో పరీక్షల్లో సత్తా చాటడానికి విద్యార్థులు.. మెరుగైన ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయులు శ్రమిస్తున్నారు. పాఠశాలల వేళలకు భిన్నంగా ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

వంద శాతంపై దృష్టి
పదో వార్షిక పరీక్ష ఫలితాలు మెరుగుపరిచేందుకు జిల్లా విద్యాశాఖ ప్రత్యేక కసరత్తు చేస్తోంది. ఉదయం, సాయంత్రం గంట చొప్పున ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం రాగి జావ అందుతున్నా సాయంత్రం ప్రత్యేక తరగతులకు విద్యార్థులు ఆకలితోనే హాజరుకావాల్సి వస్తోంది. విద్యార్థుల ఆకలి సమస్యను అధిగమించేందుకు ఈ నెల 15 నుంచి అల్పాహారం పంపిణీని ప్రారంభించారు. పదో తరగతి విద్యార్థులకు రెండేళ్లుగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి 5.45 గంటల వరకు కొనసాగుతున్నాయి. రోజుకో సబ్జెక్ట్ టీచర్ అందుబాటులో ఉండి పాఠ్యాంశాల వారీగా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు.

ప్రణాళిక ప్రకారం చదువుతున్నాం



పదోతరగతి వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో సమయం వృథా కాకుండా కష్టపడి చదువుతున్నాం. ప్రతీ సబ్జెక్ట్‌కు తగిన సమయాన్ని కేటాయించి ప్రణాళిక ప్రకారం చదువుకుంటున్నాం. అందరం ఒకేచోట కూర్చుని సందేహాలపై చర్చించుకుంటున్నాం.
– శశికుమార్, పదో తరగతి, కౌటాల

స్పెషల్ క్లాసులతో మేలు



పాఠశాలలో ఉదయం, సాయంత్రం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల్లో సందేహాలను ఉపాధ్యాయులు నివృత్తి చేస్తున్నారు. ముందుగా ప్రీఫైనల్ పరీక్షలకు సిద్ధమవుతున్నాం. ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రతి రోజూ ప్రత్యేక తరగతులకు హాజరవుతున్నాం. తరగతుల ద్వారా కొంత భయం పోయింది.
– ఎం.సవిత, పదో తరగతి, కౌటాల

మెరుగైన ఫలితాలపై దృష్టి
పదో తరగతి వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలపై దృష్టి సారించాం. ఇంటి వద్ద చదువుకోలేని వారికి ప్రత్యేక తరగతులు ఎంతో ఉపయోగపడుతున్నాయి. విద్యార్థులకు అల్పాహారం అందిస్తుండడంతో గైర్హాజరు కూడా తగ్గింది. అల్పాహారం నిధులు ఎస్ఎంసీ ఖాతాల్లో జమచేశాం. ఈ నెల 21 నుంచి పదో తరగతి విద్యార్థులకు ప్రీఫైనల్ పరీక్షలు ఉన్నాయి.
– అశోక్, జిల్లా విద్యాశాఖ అధికారి

క్లుప్తంగా

ఎంవీ డ్రైవర్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలి

- హెచ్ఎమ్మెస్ డిమాండ్

శ్రీరాంపూర్: సింగరేణిలో ఖాళీగా ఉన్న ఎంవీ డ్రైవర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని హెచ్ఎమ్మెస్ శ్రీరాంపూర్ బ్రాంచీ కార్యదర్శి టి.సారయ్య, కేంద్ర ఉపాధ్యక్షుడు వి.అనిల్‌రెడ్డి ఆదివారం డిమాండ్ చేశారు. జాప్యంతో ఉన్న వారిపై పని భారం పడుతోందని పేర్కొన్నారు. 2021లో ఎంవీ డ్రైవర్, ఈపీ ఆపరేటర్ పోస్టుల భర్తీకి కంపెనీ నోటిఫికేషన్ విడుదల చేసి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించిందని, కానీ కేవలం ఈపీ ఆపరేటర్ పోస్టులను మాత్రమే భర్తీ చేసి ఎంవీ డ్రైవర్ పోస్టులకు మాత్రం ఎలాంటి పరీక్ష నిర్వహించకుండా నిలుపుదల చేసిందన్నారు. దీనిపై ఉన్నత అధికారులు స్పందించి వెంటనే నోటిఫికేషన్ ఇచ్చి పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

చెరువులో పడి యువకుడి మృతి

లక్సెట్టిపేట: మోదెల గ్రామానికి చెందిన శశికుమార్ (26) చెరువులో పడి మృతిచెందినట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. వివరాల ప్రకారం.. శశికుమార్ కొంతకాలంగా ఫిట్స్ వ్యాధితో బాధపడుతున్నాడు. శనివారం మధ్యాహ్నం సమీపంలోని చెరువు వద్దకు బహిర్భూమికి వెళ్లగా ఫిట్స్ రావడంతో ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయాడు. ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించగా చెరువులో మృతదేహం కనిపించింది. తండ్రి రాజన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మా భూములు మాకు ఇప్పించాలి

- 5వ రోజుకు బాధితుల నిరసన దీక్ష



నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు, పాల్గొన్న నాయకులు

నస్పూర్: పట్టణంలోని నస్పూర్ శివారులోని 42 సర్వే నంబరులో తమకు చెందిన భూములను ఇప్పించాలని కోరుతూ పలువురు రైతులు టీఎన్‌జీఓ కాలనీ వద్ద కుటుంబ సభ్యులతో చేపట్టిన నిరసన దీక్ష ఆదివారం 5వ రోజుకు చేరుకుంది. వీరి దీక్షకు మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు రేగుంట సునీల్ మాదిగ, నస్పూర్ మాజీ సర్పంచ్ వేల్పుల రాజేశ్‌లు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సునీల్ మాదిగ మాట్లాడుతూ నస్పూర్‌కు చెందిన పలువురు దళిత రైతులకు చెందిన సుమారు 29ఎకరాల భూమిని పలువురు కబ్జాకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారం రోజుల క్రితం ఓ రియల్టర్ ఇంటి నిర్మాణాలకు 12 బోర్లను ఏర్పాటు వేయించారని, స్టేటస్ కో ఉన్న భూమిలో బోర్లు ఎలా వేయిస్తారని ప్రశ్నించారు. గోపాల్‌రావు అనే రియల్టర్ మధ్యవర్తిత్వం పేరిట తమకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఇందులో కొయ్యాల కొమురయ్య, సుర్మిల్ల శ్రీనివాస్, కొయ్యాల కిరణ్, రమేశ్ పాల్గొన్నారు.

ఆదివాసీల పోరుబాట

ఇటు అధికారులు.. అటు రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఆందోళన బాట పట్టేందుకు ఆదివాసీలు సిద్ధమవుతున్నారు. 11 కులాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో చేసిన తీర్మానంపై నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఆదివాసీ సంఘాలు సైతం ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు నేడు ఉట్నూర్‌లోని ఐటీడీఏ కార్యాలయ ముట్టడికి రంగం సిద్ధం చేశారు. ఇందుకు గడిచిన వారం రోజుల నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీల గూడెల్లో ప్రచారం సైతం నిర్వహించారు. ఎక్కడికక్కడ ఆదివాసీలను జాగృతం చేసే కార్యక్రమాల్లో తుడుందెబ్బ, దాని అనుబంధ సంఘాల నాయకులు నిమగ్నమయ్యారు.



జైనూర్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

- అస్తిత్వం కోసం ఆందోళన
- అగ్గి రాజేసిన సీఎం వ్యాఖ్యలు
- హక్కుల కోసం ఉద్యమబాట
- 11కులాలను ఎస్టీల్లో కలపడంపై నిరసన
- నేడు ఐటీడీఏ ముట్టడికి పిలుపు

ఏజెన్సీలో ఆదివాసీలకు ఎంత రిజర్వేషన్?

ప్రభుత్వం పలు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. త్వరలో డీఎస్సీ కూడా వేయనుంది. కానీ ఉపాధ్యాయ ఉద్యోగాల్లో ఏజెన్సీ ప్రాంతాల్లో ఎంత వరకు రిజర్వేషన్ కల్పిస్తారనే మీమాంసలో గిరిజన నిరుద్యోగ యువత ఉంది. ఏజెన్సీలోని ఉద్యోగాలు 100శాతం గిరిజనులకు వర్తించే విధంగా జీవో 3 ఇటీవల సుప్రీం కోర్టు సవరించింది. ఏజెన్సీలో 50శాతం వరకు గిరిజనులకు వర్తింపజేయాలని కోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదని ఆదివాసీలు ఆరోపిస్తున్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం మరో 15 తెగలను ఎస్టీలో చేర్చుతామనే ప్రకటనతో కేంద్ర ప్రభుత్వంపై నిరసనలు చల్లారకముందే రాష్ట్ర ప్రభుత్వం మరో 11 కులాలను ఎస్టీ జాబితాలో చేర్పించేందుకు అసెంబ్లీలో తీర్మాణం చేయడంతో నిరసనలు రెట్టింపు అవుతున్నాయి.

కెరమెరి(ఆసిఫాబాద్): ఆదివాసీల్లో నిరసన జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. ఇప్పటికే చాలా కోల్పోయామని.. ఇక కోల్పోవడానికి మా వద్ద ఏమి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగం, ఉపాధి లేక వేలాది మంది నిరుద్యోగులు ఆదివాసీల్లో ఉన్నారని, ఎస్టీల్లో మరిన్ని కులాలను చేర్చితే తమ భవిష్యత్ ఏమిటని ఆందోళన చెందుతున్నారు.

కనిపించని చట్టాల అమలు...

గిరిజన(ఏజెన్సీ) ప్రాంతాల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నప్పటికీ అవి నిరుపయోగమవుతున్నాయి. ఎక్కడ కూడా ఏజెన్సీ చట్టాల అమలు కానరావడం లేదు. ప్రత్యేక చట్టాలను రాజ్యాంగంలో పొందుపర్చినప్పటికీ ప్రభుత్వాలే వాటికి తూట్లు పొడుస్తున్నాయి. పెసా, 1/70 తదితర ప్రధాన చట్టాలు ఉన్నప్పటికీ ఎలాంటి ఉపయోగం లేకుండా పోతున్నాయి. జీవో 317 తీసుకువచ్చి ఏజెన్సీల్లో గిరిజనేతరులకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ముఖ్యంగా ఉపాధ్యాయ ఉద్యోగాల్లో ఆదిలాబాద్, కుమురంభీం జిల్లాలోని నిరుద్యోగులకు చాలా నష్టం వాటిల్లింది. భారత రాజ్యాంగంలోని షెడ్యూల్ తెగల రక్షణకు ఆర్టికల్ 342కు సంబంధం లేకుండా గిరిజన ప్రాంతాల్లో అన్ని కార్యాలపాలు చకాచకా సాగుతున్నాయి. 1/70 అమల్లో ఉన్నప్పటికీ ఆ చట్టం కేవలం కాగితాలకే పరిమితమైంది. ఏజెన్సీలోని అటవీ భూములు, స్థిరాస్తులు అన్నీ అన్యాక్రాంతమవుతున్నప్పటికీ అధికారులు మాత్రం ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు. 1/70ను 2/70 గా మార్చే కుట్ర జరుగుతోందని ఆదివాసీలు ఆరోపిస్తున్నారు. ఇటీవల కాలంలో ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అనాదిగా సాగుచేస్తున్న అటవీ భూముల నుంచి ఆదివాసీలను ఎల్లగొట్టడానికి కుట్రలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఓటు బ్యాంకు రాజకీయాలు వద్దు



ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోంది. ఇప్పటికే వలసవాదులతో అనేక విధాలుగా నష్టపోయిన ఆదివాసీలకు 11కులాలను కలుపుతూ అసెంబ్లీలో తీర్మానం చేయడం సరికాదు. ఆదివాసీల చట్టాలు, హక్కుల రక్షణ కోసం, ఆదివాసీల అస్తిత్వం కోసం పోరాటాలు చేయడానికి సిద్ధం. – ఋర్స పోచయ్య, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు

మనుగడ కోసం పోరాటం చేస్తున్నాం..



ఇప్పటికే ఎస్టీ జాబితాలో లంబాడాలను కొనసాగించడంతో ఆదివాసీ లోకం విద్య, ఉద్యోగం, ఉపాధి, రాజకీయ ఇతర అన్నీ రంగాల్లో తీవ్రంగా నష్టపోతోంది. అన్ని రంగాల్లో వారి పెత్తనంతో ఆదివాసీల అస్తిత్వానికి ప్రమాదం ఏర్పడింది. మళ్లీ ప్రభుత్వం ఇతర కూలాలను ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేయడం హేయమైన చర్య. బీఆర్ఎస్ ప్రభుత్వం ఓటు బ్యాంక్ రాజకీయం కోసం ఆదివాసీల మనుగడను ప్రమాదంలో నెట్టివేస్తోంది. సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం ఆగదు. – పుర్క బాపురావ్, ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఆదివాసీల ప్రధాన డిమాండ్లు..

- ఎస్టీల్లో ఇతర కులాలను చేర్చవద్దు..
- చట్టబద్ధత లేని లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి.
- గిరి వికాసం కింద ఆదివాసీలకు బోర్లను మంజూరు చేయాలి.
- ఆదివాసీలు సాగు చేస్తున్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలి.
- జిల్లా, మండల కేంద్రాల్లో నివాసం ఉంటున్న ఆదివాసీలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలి
- పెసా, 1/59, 1/70 చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి.
- జీవో 3 యథావిధిగా కొనసాగించాలి.
- 29శాఖాల్లో ఉన్న జీవోలను చట్టం చేసి 29 శాఖాల్లో ఉన్న ఉద్యోగాలను ఆదివాసీలతో నియమించాలి.
- గిరిజన యూనివర్సిటీ ఆదిలాబాద్ జిల్లాలోనే ఏర్పాటు చేయాలి.
- జీవో 317ను రద్దుచేయాలి.
- ప్రత్యేక డీఎస్సీతో ఆదివాసీలచే ఉపాధ్యాయ ఉద్యోగాలు నియమించాలి
- నాన్ ఏజెన్సీ ఆదివాసీ గ్రామాలకు ఏజెన్సీ గ్రామాలుగా మార్చాలి.
- దళితబంధు మాదిరిగానే ఆదివాసీబంధు ఇవ్వాలి.

'చిన్నయ్యను విమర్శిస్తే నాలుక చీరేస్తాం'



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత

బెల్లంపల్లి: బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా పాటుపడుతున్న ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై తప్పుడు విమర్శలు చేస్తే నాలుక చీరేస్తామని బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, బీఆర్ఎస్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ నూనేటి సత్యనారాయణ, పార్టీ అధికార ప్రతినిధి కాసర్ల యాదగిరి, గెల్లి రాజలింగు హెచ్చరించారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్యే చిన్నయ్య చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేక బీజేపీ నాయకుడు కొయ్యల ఏమాజీ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆసిఫాబాద్‌కు చెందిన ఏమాజీ అక్కడ గిరిజనుల భూములను అమ్ముకుని ఆదివాసీలను దోచుకున్నారని విమర్శించారు. తప్పుడు విధానాలను అవలంభించడంతో ఆసిఫాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ నుంచి ఏమాజీని బహిష్కరించారని, అక్కడ చెల్లని రూపాయి బెల్లంపల్లికి వచ్చి ఎమ్మెల్యే చిన్నయ్యను దుర్భాషలాడుతున్నాడన్నారు. బెల్లంపల్లిలో బీజేపీ నాయకులను తిరగనీయబోమని హెచ్చరించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఏమాజీ బీజేపీ పక్షాన పోటీ చేసి 1500 ఓట్లు తెచ్చుకున్నాడని, ఆయనను నియోజకవర్గ ఓటర్లు నమ్మడం లేదనడానికి ఆ ఓట్లే ప్రమాణికమని పేర్కొన్నారు. స్థాయిని మరిచి విమర్శలు చేయడం మానుకోవాలని, లేకపోతే తరిమితరిమి కొట్టాల్సి వస్తుందని అన్నారు. సమావేశంలో బెల్లంపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బొడ్డు నారాయణ, మున్సిపల్ కౌన్సిలర్లు గోనిక రమేష్, గద్దం అశోక్, దామెర శ్రీనివాస్, మాటూరి మధు, మాజీ కౌన్సిలర్ ఎలిగేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కుక్కల స్వైరవిహారం



కుక్కల దాడిలో గాయపడిన సత్తవ్వ

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని కూరగాయల మార్కెట్ సమీపంలో కుక్కలు ఆదివారం సాయంత్రం స్వైరవిహారం చేశారు. పదకొండు మందిని తీవ్రంగా గాయపరిచాయి. వైద్యాధికారి శేఖర్ వివరాల ప్రకారం... ఆదివారం సంతలో ప్రజలపై కుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. పట్టణానికి చెందిన సుశీల, శ్రీకాంత్, సత్తయ్య, సత్తవ్వ, రాజమ్మ, భూమయ్య, లక్ష్మణ్, పోచవ్వ, రాజమౌళి, యూసుఫ్, ఉమ గాయపడగా వారికి సివిల్ ఆసుపత్రిలో చికిత్స అందించి మంచిర్యాల ఆసుపత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించారు.

యువత శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి

- విగ్రహం ఏర్పాటులో యువకులు తీరు అభినందనీయం
- ఎంపీ సోయం బాపూరావు



మాట్లాడుతున్న ఎంపీ

జన్నారం: యువకులు ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు అన్నారు. ఆదివారం జన్నారం మండలం కవ్వాల్ గ్రామంలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కవ్వాల్ గ్రామానికి చెందిన యువకులు ఐకమత్యంతో విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో యువకులు సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో హిందుత్వం పెంపొందుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ పథకాలను తమ ఖాతాలో వేసుకుని ప్రధాని పేరు రాకుండా చూస్తుందన్నారు. నియోజకవర్గంలో అనేక గ్రామాలు ఇంకా అభివృద్ధికి నోచడం లేదని ఆరోపించారు. మామిడిపెల్లి, కవ్వాల్ రోడ్డు నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అడవి అనుమతులు పొందేలా చొరవ తీసుకుంటానని తెలిపారు. అదే విధంగా కవ్వాల్ పోచమ్మ ఆలయం వరకు ఎంపీ నిధులతో రోడ్డు నిర్మాణం చేపడుతామని హామీ ఇచ్చారు. లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా కవ్వాల్‌కు నీరు అందించే విషయంపై ఉన్నత అధికారులతో, రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడుతానని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజావ్యతిరేక పాలనకు చరమగీతం పాడాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెర్రబెల్లి, జెడ్పీటీసీ జానుబాయి, సర్పంచ్ లక్ష్మీ, బీజేపీ మండల అధ్యక్షుడు గోలి చందు, సర్పంచులు అశోక్‌రావు, గంగాధర్, ఎంపీటీసీ కొంతం శంకరయ్య, బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు బద్రినాయక్, నియోజకవర్గ ఇన్‌చార్జి హరినాయక్, మండల నాయకులు ఉట్కూరి శ్రీనివాసరెడ్డి, మధుసూదన్‌రావు, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు వెడ్మ బొజ్జు ఉన్నారు.

'గుర్తింపు' ఎన్నికలు నిర్వహించాలి

- ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్
- ఐఎన్టీయూసీలో పలువురికి పదవులు



నియామక పత్రాలు అందిస్తున్న జనక్‌ప్రసాద్

శ్రీరాంపూర్: సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు వెంటనే నిర్వహించాలని ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ బి.జనక్‌ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల కాలపరిమితి ముగిసి రెండేళ్లు అవుతుందన్నారు. అయినా ఎన్నికలు నిర్వహించకుండా సింగరేణి జాప్యం చేస్తోందన్నారు. న్నికలు నిర్వహిస్తే సింగరేణిలో టీబీజీకేఎస్ ఓడిపోతుందనే భయంతో సర్కార్ ఎన్నికలు నిర్వహించడం లేదన్నారు. దీనిపై ఏఐటీయూసీ హైకోర్టును ఆశ్రయించగా 3నెలల్లో ఎన్నికలు నిర్వహించాలని ఆదేశాలిచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికలపై వారికి నిజంగా చిత్తశుద్ధి లేదన్నారు. అలాగే 10వ, 11వ వేజ్‌బోర్డులో ఐఎన్టీయూసీని లేకుండా మోదీ సర్కార్ అడ్డుకుందని, తాజాగా కోల్‌కత్తా హైకోర్టు దీనిపై ఐఎన్టీయూసీ ఈ 11వ వేజ్ బోర్డులో తీసుకోవాలని కోలిండియాను ఆదేశించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయూనియన్ ప్రధాన కార్యదర్శి కాంపెల్లి సమ్మయ్య, బ్రాంచీ ఉపాధ్యక్షుడు జే శంకర్‌రావు, నాయకులు గరిగే స్వామి, భీంరావు, సమ్ము రాజయ్య, తిరుపతి పాల్గొన్నారు.

కమిటీలో పలువురికి చోటు...

ఐఎన్టీయూసీ కేంద్ర ఉపాధ్యక్షులుగా కలవేని శ్యాం, ఆర్గనైజింగ్ సెక్రటరీగా భీం రవి, సెంట్రల్ కోర్ కమిటీ సభ్యుడిగా శీలం చిన్నయ్య, శ్రీరాంపూర్ బ్రాంచీ కన్వీనర్‌గా ఆర్ కృష్ణమూర్తిలతోపాటు పలువురికి కమిటీలోకి తీసుకున్నారు.

'విద్యారణ్య'లో అ'పూర్వ' వేడుక



హాజరైన పూర్వ విద్యార్థులు

- 42 బ్యాచ్‌ల విద్యార్థులు రాక
- 3వేల మందికిపైగా పూర్వ విద్యార్థులు, ఆచార్యుల హాజరు
- వేడుకకు వేదికైన రాంపూర్ ఆవాస విద్యాలయం



1990 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): వారంతా చిన్ననాటి స్నేహితులు.. కలిసి చదువుకున్నారు.. ఉన్నత చదువుల కోసం తలాదారి పట్టారు. అలా దూరమైన అలనాటి బాల్య మిత్రులు నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో కలుసుకున్నారు. అనాటి జ్ఞాపకాలను.. చిలిపి అల్లరిని గుర్తు చేసుకుంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా.. ఉల్లాసంగా గడిపారు. వారి అంతులేని ఆనందానికి.. పట్టరాని సంతోషానికి వేదికగా నిలిచింది మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం పడ్తనపల్లి గ్రామంలోని రాంపూర్‌లోని చొక్కారాంనగర్ శ్రీవిద్యారణ్య ఆవాస విద్యాలయం.

ఒకేచోటకు 42 బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు..

రాంపూర్ శ్రీవిద్యారణ్య ఆవాస విద్యాలయంలో పదో తరగతి వరకు చదువుకున్న మొత్తం 42 బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ మహాసమ్మేళనంతో ఒకచోట కలుసుకున్నారు. 1980 నుంచి 2022 విద్యా సంవత్సరాల్లో చదువుకున్న దాదాపు 3,000 వేల మందికి పైగా విద్యార్థులతో పాటు వారికి పాఠాలు బోధించిన ఆచార్యులు ఒకేచోట చేరి ముచ్చట్లలో మునిగిపోయారు. ఆవాస విద్యాలయం పరిసరాలు, మైదానం మొత్తం పూర్వ విద్యార్థులతో సందడిగా మారాయి. ఇందులో శ్రీసరస్వతీ విద్యాపీఠం క్షేత్ర సంఘటనా కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి, పాఠశాల అధ్యక్షుడు మాధవరపు వినయ్‌ప్రకాశ్‌రావు, మంచిర్యాల విభాగ్ అధ్యక్షుడు డాక్టర్ కె.విష్ణువర్ధన్‌రావు, పాఠశాల ప్రారంభ ప్రధానోపాధ్యాయుడు కోటంరాజు, పూర్వ విద్యార్థి పరిషత్ ప్రాంత అధ్యక్షుడు రెడ్డిగారి హరిస్మరణ్‌రెడ్డి, పాఠశాల అధ్యక్షుడు గుండం అశోక్ పాల్గొన్నారు.

నాటి రోజులు గుర్తొచ్చాయి..



పాఠశాలలో అటూ ఇటూ తిరుగుతూ స్నేహితులతో గడిపిన రోజులు అన్నీ గుర్తుకు వచ్చాయి. వివిధ కారణాలతో దూరమైన తాము ఇప్పుడు ఇలా కలుసుకోవడం సంతోషంగా ఉంది. తోటి విద్యార్థులతో పాటు ఆచార్యులను కలవడం ఆనందంగా ఉంది. ఈ తీపి గుర్తులు జ్ఞాపకాలుగా మిగిలిపోనున్నాయి. – డాక్టర్ చేతన్‌చౌహాన్, ఎం.డీ.జనరల్ ఫిజీషియన్, పూర్వ విద్యార్థి

పూర్వ విద్యార్థులుగా సేవ చేస్తాం..



పూర్వ విద్యార్థులుగా అందరినీ కలుసుకోవడంలో చాలా సంతోషంగా ఉంది. సమ్మేళనంలో చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకోగా ఇప్పుడు మరెన్నో జ్ఞాపకాలను వెంట తీసుకుని వెళ్లేలా ఈ వేడుక తోడైంది. పాఠశాలలో నేర్పిన విద్యాబుద్ధులు, ఉన్నతంగా తీర్చిదిద్దాయి. – మల్రాజ్ రవీందర్, జిల్లా రిజిస్ట్రార్, హైదరాబాద్

విద్యార్థుల ఉన్నతి ఆనందాన్ని ఇస్తుంది



పాఠశాలలో విద్యార్థులుగా చదువుకుని ఉన్నత స్థితిలో ఉన్న తమ శిష్యులను చూస్తూ ఉంటే ఆనందంగా ఉంది. విద్యార్థులుగా నాడు చదువుకున్న వారు ఇప్పుడు ఒకొక్కక్కరూ సుదూర ప్రాంతాల నుంచి వచ్చి గురువులను ఆత్మీయంగా సత్కరించడం మరచిపోలేని అనుభూతి. – వెంకటరెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు

వైభవంగా సామూహిక వివాహాలు



వధూవరులు

- మూడుముళ్లతో ఏకమైన ఎనిమిది జంటలు
- మంగళసూత్రాలు అందజేసిన ఆసిఫాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి



వధూవరులతో జెడ్పీ చైర్‌పర్సన్ లక్ష్మి

ఆసిఫాబాద్/: సిర్పూర్(యూ) మండలం మహాగావ్ సురోజీ బాబా ఆశ్రమంలో ఆదివారం సామూహిక వివాహాలు వైభవంగా నిర్వహించారు. ఏటా శివరాత్రి పర్వదినం సందర్భంగా నిర్వహించే సామూహిక వివాహాల్లో భాగంగా సరోజి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఎనిమిది పేద జంటలకు వివాహాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డోలు వాయిద్యాలు, ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలతో సామూహిక వివాహాలు జరిపించారు. జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి వారికి ఉచితంగా మట్టెలు, మంగళసూత్రాలు, నూతన వస్త్రాలతో పాటు వంట సామాన్లు అందజేశారు. సామూహిక వివాహాలు జరిపిస్తున్న సరోజి కమిటీని అభినందించారు. ఈ సందర్భంగా సురోజి బాబా మఠాధిపతి మెస్రం కైలాస్ మహారాజ్ మాట్లాడుతూ ఇప్పటివరకు సుమారు 500 వివాహాలు జరిపించామన్నారు. అనంతరం అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు, కమిటీ అధ్యక్షులు కొటానక పాండురంగ్, మెస్రం భూపతి మహరాజ్, వినాయక్ మహరాజ్, కిషన్ మహరాజ్, తానుపటేల్, పెందూర్ రాషావు మహరాజ్, భీమ్‌రావు మహరాజ్, ఎంపీపీ తొడసం భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ ఆత్రం ప్రకాశ్, కెరమెరి జెడ్పీటీసీ ద్రుపదబాయి, సర్పంచ్ ఆత్రం పద్మరాజేశ్వర్, బీఆర్ఎస్ నాయకులు తొడసం ధర్మారావు, గోండ్వానా మహాసభ జాతీయ ఉపాధ్యక్షులు సిడాం అర్జున్, ఏఎంసీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, సహకార సంఘం చైర్మన్ శివాజీ, ఆత్రం చొక్కారావు, మెస్రం భూపతి, మెస్రం అంబాజి, సీతారాం పాల్గొన్నారు.